# అది పీటముడి

హైదరాబాద్

06.06.2000

"రావూజీగారూ,

మీకు నమస్కారం. మీరు నా భర్త కాబట్టి చాలా చాలా గౌరవం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో మీ పేరుకు జీ- గారు- గూడా కలిపాను.

కోపం తెచ్చుకోకుండా నేను వ్రాసే విషయం అర్థం చేసుకుంటారనుకుంటాను. మా అమ్మా నాన్నా మీ కోరిక విని నన్ను (నన్ను మాత్రమే) చెడతిట్టారు. నన్నే ఎందుకు తిట్టారూ అంటే మిమ్మల్ని పెళ్ళి చేసుకొని అయిదేళ్ళయినా మీ ముక్కుకు సరైన తాడు వేయలేని వాజమ్మనయినందుకు. మీ మీద గౌరవం అనే బలహీనత నన్ను అలా చేయ నీయలేదు. కనుక రావూజీగారూ- ఇక మా నాన్ననుంచి మీకు ఒక్క పైసా కూడా ముట్టదు. తరువాత నిర్ణయం తీసుకోవలసింది మీరు- మనిద్దరం కలిసి కాపురం చేద్దామా వద్దా అని!

నన్ను సంతోషపెట్టే జాబు మీనుండి వస్తుందని ఆశిస్తూ-

- మీ భార్య, సావిత్రి."

గుంటూరు

12.06.2000

"డియర్ సావిత్రీ అమ్మాళ్,

భార్య భర్తకు గౌరవం ఇచ్చినప్పుడు, భర్తా భార్యకు గౌరవం ఇవ్వటం న్యాయం కదా. అందుకే నీకు అమ్మాళ్ తగిలించాను.

నువ్వు రాసిన ఉత్తరం పరమ ఛండాలంగా వున్నది. నేను మీ నాన్నను అడిగింది యాభైవేలు. కాస్త అటూ యిటూగా ఇస్తానన్నా ముక్కుమూసుకొని ఏదో విధంగా సర్దుకుండేవాడిని. పైసా కూడా ఇవ్వనని పెద్దల్లుడిననైనా గౌరవం లేకుండా మీ నాన్న కుండ బద్దలుకొట్టినట్లు అన్నాడూ అంటే- ఆయన ఎంత కర్కోటకుడో ఇప్పుడు అర్థమవుతున్నది.

నేనేం ఊరికినే ఇవ్వమనటం లేదు. నాకు పెళ్ళిలో కట్నంగా యాభైవేలు ఇచ్చారు. అదే మీ చెల్లెలు మొగుడికి లక్ష ఇచ్చారు. ఆయనగారు ఎంత అల్లుడో నేనూ అంతేకదా. ఆయనా బ్యాంకులోనే పని చేస్తున్నారు, నేనూ బ్యాంకు లోనే పనిచేస్తున్నాను.

ఇంకా బోనస్‌గా నాకే ఎక్కువ ఇవ్వాలి. రాచిరంపాన పెట్టేటందుకు మీ చెల్లెలు కున్నట్లుగా నీకు అత్తగారు లేదు.

మరోసారి ఆలోచించుకొని ఎంతివ్వగలడో చెప్పమను. నీతో కాపురం చేయాలో వద్దో అప్పుడు నేను నిర్ణయం తీసుకుంటాను.

- నీ భర్త, సత్యవంతరావు."

హైదరాబాద్

20.06.2000

"అయ్యా,

నమస్కారం. మీరు వ్రాసిన ఉత్తరం మా నాన్నకు చూపించాను. గంయ్‌న లేచాడు. ఇదేమైనా వంకాయల బేరమా అంటూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు- మిమ్మల్ని. తను మాత్రం మీరన్నట్లుగా కర్కోటకుడిని కాదని ఖచ్చితంగా చెప్పేశాడు.

ఓ చిన్నమాట- మా యింటిపక్క మగపిల్లల కాలేజీలో పనిచేసే ప్రిన్స్‌పాల్‌గారున్నారు. మీలాగా కాదు, చాలా మంచాయన. వాళ్ళ కాలేజీలో లెక్చరర్ పోస్టు ఖాళీగా వున్నదట. జేరమని అడుగుతున్నారు. చాలా పోటీ వున్నది త్వరగా తేల్చుకోమంటున్నారు. జేరమంటారో వద్దో వెంటనే రాయండి.

- మీ భార్య, సావిత్రి."

గుంటూరు

26.06.2000

"అమ్మా సావిత్రీ,

నేను తప్ప అంతా మంచివాళ్ళలాగానే కనబడతారు నీకు.

నువ్వు కాలేజీలో జేరతావో, గంగలో దూకుతావో నీ యిష్టం. మీ నాన్న నన్ను తిట్టాడన్నావు గదా- అందుకు పెనాల్టీగా ఇంకో పదివేలు కలిపి డిడి తీసుకొని ఏ రైలుకైనా రావచ్చు. (మీ నాన్నిచ్చే చెక్కును నేను నమ్మను)

ఉంటాను.

- నీ భర్త, సత్యవంతరావు."

హైదరాబాద్

02.07.2000

"స్వామీ,

అసలు ఏమీ ఇవ్వనంటుంటే ఇంకా బోడి డి.డి. ఏమిటి... నేను మీ పాదదాసిని అంటూ మీ కాళ్ళు పట్టుకు ఏడవటానికి పూర్వకాలపు అమ్మమ్మను కాను. మీలాంటి అతి తెలివి భర్తతో అయిదేళ్ళు ధక్కా మొక్కీలు తింటూ భార్యగా కాపురం చేసినదాన్ని.

మీరు, మా నాన్న ఏదో అన్నాడని పెనాల్టీ వేశారు గదా. మీరు మా నాన్నను కర్కోటకుడు అన్నందుకు నేనూ వేయగలను. కానీ నా ఖర్మకొద్దీ నేను తలవంచుకు కూర్చున్నప్పుడు మీరు నా మెళ్ళో మూడు ముళ్ళూ వేశారే.

మా నాన్న అన్నాడు- మీకు ఐదేళ్ళ క్రితం యిచ్చిన యాభైవేలను- ఇందిరా వికాస పత్రంలోనో, కిసాన్ వికాసపత్రంలోనో వేసివుంటే ఈపాటికి అదీ లక్ష అయివుండేది- మీ ఆయన శుద్ధ మొద్దావతారం అయితే నేనేం చేసేది అన్నాడు.

ఆయన అన్నది కూడా నిజమే అనిపించింది నాకు.

మీకూ బోడిస్నేహితులు చాలామంది వున్నారుగదా- వాళ్ళను సంప్రదించండి- వాళ్ళలో బుద్ధున్నవాడెవడైనా మీకు సరైన సలహా యివ్వగలుగుతాడు.

నన్ను మా పక్కింటి ప్రిన్స్‌పాల్‌గారు మహా వత్తిడి చేస్తున్నారు. మీరెలాగూ నన్ను ఏ గంగలోనైనా దూకమన్నారు గదా– అప్లికేషన్ రేపు ఇస్తున్నాను.

ఈ మధ్య మన బొట్టికాయ ఎందుకో రాత్రిళ్ళు నాన్నా నాన్నా అని కలవరిస్తున్నాడు. దడుసుకుంటాడో ఏమో ఖర్మ.

మర్చిపోయాననండోయ్ మన పనిమనిషి– మొగుడికి రోగం వచ్చిందని క్రిందటి నెలలో వందరూపాయలు ఎడ్వాన్సు తీసుకున్నది. దాన్ని వచ్చే నెలలో పట్టుకోవాలి.

– సావిత్రి."

గుంటూరు

11.07.2000

"సావిత్రీ,

అసలు నీకు బుద్ధివున్నదా? పనిమనిషికి ఎవరైనా ఎడ్వాన్సు ఇస్తారుటే. అది నువ్వెళ్ళినప్పటినుండీ మనింట్లో పని చేయటం లేదు. ఆడవాళ్ళు లేని కొంపలో అడుగు పెట్టనని వాళ్ళాయనకు మాట ఇచ్చిందట... ఆ వందా గోవిందానే... కనుక ఆ వందకూడా మీ నాన్నే ఇవ్వాలి.

నీ ఉద్దేశ్యం నాకు అర్థం కాలేదు. నీ మాట, మీ నాన్న మాట కాదన్న నా మిత్రులంతా బుద్ధిలేని వాళ్ళవుతారా. ఇంకోసారి అలా కూశావంటే పళ్ళు రాలగొడతాను.

మీ నాన్న ఖచ్చితంగా అరవైవేల వందా యిస్తేనే నేను నీతో కాపురం వెలగబెట్టేది. లేదా విడాకుల కాగితాలు పంపిస్తాను.

చంటాడు నాన్నానాన్నా అంటున్నందుకయినా ఆ డబ్బు తెచ్చి నాకివ్వవచ్చు గదా. ముసలాడు ఏంచేసుకుంటాడట ఉన్న లప్పంతా. కన్నకూతురిని, ఆవిడగారి మొగుడిని సంతోషపెట్టటం చేతగాకపోతేసరి.

కాస్త మీ నాయన్ను బుర్రపెట్టి ఆలోచించి, మంచి నిర్ణయం తీసుకొని, కూతురి కాపురాన్ని సరిదిద్దుకోమను.

– సత్యవంతరావు."

హైదరాబాద్

18.07.2000

"ఏమండీ,

మా నాన్న మీ ఉత్తరం చదివి ఏమన్నాడో తెలుసా- జాతకాలు కలవకపోయినా, పేర్లు కలిసినాయి కదా అని బుద్ధి గడ్డితిని పెళ్ళిచేసాను... నేను చచ్చినా అతగాడు నా అల్లుడని చెప్పుకోను- అని రెండు చెంపలూ టపటపా వాయించు కున్నాడండీ.

నేను పుట్టిం తరువాత, పదేళ్ళపాటు ఆగిపోయిన ఆయన ఇంక్రిమెంటు రిలీజ్ అయిందట. నేను ఆయనకు స్వయానా లక్ష్మీదేవిలాంటిదాన్ని. నన్ను పళ్ళురాలగొడతానని రాసినందుకు ఆయన కోర్టులో దావా వేస్తానంటున్నారు.

ఇక మీరూ, మీ మామా ఫుట్‌బాల్ ఆడుకుంటారో, వాలీబాల్ అడుకుంటారో మీ యిష్టం.

చంటాడికి మొన్న నూటనాలుగు జ్వరంవచ్చింది. నాన్నా అని ఏడుస్తుంటే మీరున్న నా పెళ్ళిఫొటో చూపించాను. తృప్తి పడ్డట్టున్నాడు ఏడుపాపాడు.

మీ మామా అల్లుళ్ళ భాగోతం ఆలస్యమయ్యేట్లుంటే మీ ఫొటో ఎన్‌లార్జ్ చేయిస్తాను ఓ వందపోయినా సరే.

మా పక్కింటి ప్రిన్స్‌పాల్‌గారు నన్ను నిద్రపోనీయటంలేదు - ఉద్యోగంలో ఎప్పుడు జేరతావు అంటూ. అసలే ఆయన పెళ్ళాం పోయిన దిగుల్లో వున్నాడు. ఈ సమయంలో ఆయన మనస్సును మరింత కష్టపెట్టటం నాకిష్టం లేదు.

- ఇట్లు, మీచేత ఖర్మకొద్దీ మూడుముళ్ళూ వేయించుకున్న,

-సావిత్రి."

గుంటూరు

25.07.2000

"ఒసేయ్,

మీ పక్కింటాయన పెళ్ళాం చావటానికి, నువ్వు ఉద్యోగంలో జేరటానికి సంబంధమేమైనా వున్నదా... నువ్వు ఏం రాశావో నీకు అర్థమవుతున్నదా?

మళ్ళీ ఆయన దగ్గర ఉద్యోగంలో జేరతాను అని రాశావో మర్యాదగా వుండదు ఏవనుకుంటున్నావో. నీకు ఉద్యోగం చేయాలనే రంధి ఎందుకు పుట్టిందో ఇప్పుడు నాకు అర్థమవుతున్నది.

ఇంకో సంగతి - నా ఫోటో ఎన్‌లార్జ్ చేయిస్తానంటున్నావ్... నీ తంతు చూస్తే దానికి దండేసి ప్రిన్స్‌పాల్‌గారింటి గోడ దూకేసేటట్లున్నావ్... ఎలా ఉన్నది ఒళ్ళు... చీరేస్తాను జాగ్రత్త!

మొన్న జిన్నాటవర్ దగ్గర మా అత్తయ్య కూతురు రంభ కనబడి కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. ఏవిటి బావా నువ్వు ఇంట్లో ఒంటరిగా క్రిందామీదా పడుతూ ఏడుస్తున్నావట గదా... నేను లేనా... కాకితో కబురంపితే మీ ఇంటికి వచ్చి వాలనా అన్నది. దాని కన్నీళ్ళు చూస్తే నా గుండె తరుక్కుపోయింది.

ఇక ఆలస్యం చేస్తే ఊరుకునేది లేదు. అరవైవేల వందా తీసుకొని వెంటనే గుంటూరు వచ్చేసేయ్. ఇంటి తాళం చెవి ఇంటి వాళ్ళింట్లో ఇచ్చి ఆఫీసుకు వెళతాను.

- సత్యవంతరావు."

హైదరాబాద్
02.08.2000

"అయ్యా భర్తగారూ,

శతకోటి దణ్ణాలు. మీ ఛండాలపు మగబుద్ధి పోనిచ్చుకున్నారు గాదు. మా పక్కింటి ప్రిన్స్‌పాల్‌గారి పెళ్ళాం చచ్చిపోయింది కాబట్టి ఆయన కొంపలో జేరతానని మీరు అనుకుంటున్నారంటే మీదెంత కుళ్ళుబుద్ధో అర్థమవుతున్నది. నేనేం ముప్పయి ఏళ్ళు వచ్చినా పెళ్ళికాని మీ మేనత్తకూతురిలా కిలాడీదాన్ని గాదు- పెళ్ళాం పుట్టింటికి వెళ్ళింది గదా అని బావ కొంపకు చిచ్చుపెట్టేటందుకు. మా పక్కింటి ప్రిన్స్‌పాల్‌గారికి డెబై ఏళ్ళండీ. రిటయిరయి పన్నెండేళ్ళయింది. ఉన్న పళ్ళన్నీ ఊడి ఎనిమిదేళ్ళు అయింది!

మీ అత్త కూతురు గనుక మనింట్లో జేరిందా నేను ఓ గంట సేపు గుంటూరు వచ్చి ఇద్దరికీ తోలు వలుస్తాను.

మానాన్న మీ పేరు చెబితే చాలు కల్లు త్రాగకపోయినా దానంత గొడవ చేస్తున్నాడు ఇంట్లో. నిన్ననే ప్లీడరుగారి దగ్గరకు వెళ్ళి వచ్చాడు. మీరు రాసిన ఉత్తరాలు చాలు మిమ్మల్ని అండమాను పంపించటానికి, కలరా ఉండలేసి పాడయిపోకుండా జాగ్రత్తగా

దాచిపెట్టండి అని అన్నాడట ఆయన. మా నాన్న ఆయన మాట విన్న దగ్గరనుంచీ నేల మీద నడవటం లేదు.

మా పక్కింటి ప్రిన్స్‌పాల్‌గారు– నెలకు రెండువేల జీతాన్ని చేతులారా వదులుకోవద్దని తెగపోరు పెడుతున్నారు.

భారత స్త్రీ కోరుకునేలా నా సంసారం బాగుండాలి కాబట్టి ఓ రెండు మూడేళ్ళు ఉద్యోగం చేసి అరవైవేలు తెచ్చి మీ ముఖాన కొట్టి నా సంసారాన్ని నేను కుదుట పరుచుకుందామనుకుంటున్నాను.

మా నాన్నా, నేనూ మీ గురించి మాట్లాడుకోవటం విన్నాడు కాబోలు, రెండేళ్ళ చంటివెధవకు ఏమర్థమయిందో ఏమో... నేనిచ్చిన మీ ఫొటో తీసుకొని చించి అవతల పారేశాడు.

పనమ్మాయి మన ఎదురింటి సుబ్బలక్ష్మికి కూడా పని చేసిపెడుతున్నది. నా పేరు చెప్పి ఆమెను ఆ వందా వసూలు చేయమనండి. అంతేగాని మా నాన్న ఎకౌంట్‌లో జమ చేస్తే ఊరుకుండేది లేదు.

– నేను సావిత్రిని."

గుంటూరు

06.08.2000

"ఒసేయ్ సావిత్రీ,

అండమాన్ అంటే భయపడిపోయి నిన్ను తీసుకు వచ్చి సంసారం చేస్తానని అనుకుంటున్నావ్ గదూ. మీ అయ్యా కూతుళ్ళిద్దరూ అండమాన్ దోమలకంటే విషపూరితమైన కీటకాలే. అవునూ– నీకెంత పొగరు... నీ బోడి రికమండేషన్‌తో నేను సుబ్బలక్ష్మి ద్వారా పనిమనిషి దగ్గర వంద రూపాయలు వసూలు చేసుకోవాలా? నాకు సుబ్బలక్ష్మి మొగుడు తెలీదనుకున్నావా... మా మగవాళ్ళకు అంత వసూలు చేసుకునే శక్తి లేదనుకున్నావా...? జాగ్రత్త.

పిచ్చి పిచ్చి ఉత్తరాలు రాయటం మానేసి నాకివ్వాల్సిన డబ్బులకు డిడి తీసుకొని (నా పేరు మీద) రైలెక్కు.

ఇక ఆలస్యం చేశావో ఇంతేసంగతులు.

– సత్యవంతరావు."

హైదరాబాద్
20.08.2000

"ఏమండోయ్.

మీ మగవాళ్ళంత దౌర్భాగ్యులు ఈ ప్రపంచంలో మరెవ్వరూ వుండరని శుభ్రంగా ఋజువయి పోయింది.

ఉద్యోగంలో రేపు జేరుదామని చెప్పటానికి రాత్రి మా పక్కింటి ప్రిన్స్‌పాల్ గారింటికి వెళితే- ఆయన త్రాష్టపు కొడుకు- నిన్ను నీ డబ్బు పిచ్చి మొగుడు వదిలేశాడు గదా... నన్నూ నా పెళ్ళాము వదిలేసింది... ఇద్దరం కలసి ఝూంమ్మంటూ నాలుగు ఊళ్ళూ తిరిగి వద్దాం పద అని నా చేయి పట్టుకోబోయాడు. నా మొగుణ్ణి నేను తప్పా ఇంకెవరన్నా అంటే ఊరుకుంటానా... ఎడంకాలు చెప్పు తీసి ఎడాపెడా వాయించాను.

చంటాడు మీ కోసం ఒకటే ఏడుపు. రేపాదివారం పొద్దున్నే నాగార్జున ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరుతున్నాను.

మీ డబ్బును అక్కడే ఏదో ఉద్యోగం చేసి సంపాదించి మీ దోసిట్లో పోస్తాను. పదకొండు గంటలకల్లా స్టేషన్‌లో ఉండండి. లేకపోతే చూసుకోండి.

ఇట్లు, మీ భార్య,
సావిత్రి."

గుంటూరు
20.08.2000

"సావిత్రీ,

ఇంటి వాళ్ళింట్లో మనింటి తాళం చెవి ఇచ్చానని రాశాను గదా! మా అత్తయ్య కూతురు- ఆ కిలాడీ నేను నిన్న ఆఫీసునుండి వచ్చేటప్పటికల్లా మనింట్లో జేరి- బీరువాలోనుంచి నీ పెళ్ళి చీర ఒకటి తీసి కట్టుకొని- కులుక్కుంటూ ఎదురొచ్చి... పోయిన దానికోసం ఊరికినే ఏడుస్తూ ఎండిపోయిన మానులా ఎదురు చూడటం దేనికి బావా- నేనున్నాను గదా... నీక్కావాల్సిన ఆ బోడి డబ్బు మా నాన్న నడిగి నేను తెచ్చిస్తాలే అన్నది. నా అరికాల్లో మంట నెత్తి కెక్కింది. దాన్ని అరగంట తిట్టి- నీ పెళ్ళి చీర విప్పించి- దాన్ని బయటకు నెట్టా. నీ చీరను డ్రైక్లీనింగ్‌కి ఇచ్చాను. మీ నాయనకు

ఎట్లాగూ మీరిద్దరే కూతుళ్ళు. ఆయన తరువాత ఆస్తంతా మీ ఇద్దరికే గదా వచ్చేది. అప్పుడు ఏడుస్తాలే నాకు రావాల్సిన అరవై వేల కోసం.

పిల్లాడు లేకపోతే ఇల్లంతా బోసిపోతున్నదే. నేను రేపు ఆదివారం చీకటితో పల్నాడుకు బయిల్దేరి హైద్రాబాద్ వస్తున్నాను. చంటి వెధవను చూసి ఎన్నాళ్ళయిందో- వాడిని తీసుకొని పదిన్నరకల్లా స్టేషన్‌కు తగలడు.

ఉంటాను.

– సత్యవంతరావు."

*(ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక: ఫిబ్రవరి, 2001)*